
కేశిరాజు ఫణిప్రసాద్



# అరుదైన అబ్బాయి

కథ

## 'ఈతరంలో ఇటువంటి అబ్బాయిలుంటారంటే నమ్మకం కలగటం లేదు'

## 'నిజంగా శ్రీను ఇంత గొప్పవాడని ఇప్పుడే తెలిసింది.'

## 'గొప్పతనానికి వయసుతో సంబంధంలేదు. మంచితనానికి సామాజిక స్థాయితో సంబంధంలేదు'

'మనిషంటే శ్రీనే. వెల్‌డన్ శ్రీను.'

'అబ్బాయిల్లోని అరుదైన అబ్బాయి శ్రీను'

'అరుదైన అబ్బాయిల్లో అతి అరుదైన అబ్బాయి శ్రీను'

ఏ నోట విన్నా ఇవే మాటలు. ఎవరి మనసు పలికినా ఇవే పొగడ్తలు.

వింటున్న శ్రీనుకు ఆనందంతో మది ఉప్పొంగటంలేదు. గర్వంతో ఛాతీ పొంగటంలేదు. అతని కళ్లల్లో నీళ్లు కదులుతున్నాయి. అతని హృదయ ఫలకంపై గతం తాలూకు దృశ్యాలు కనబడుతున్నాయి.

** ** **

శ్రీను తండ్రి ధనవంతుడు. ఊళ్లో పెద్ద మోతుబరి. వాళ్లింట్లో ఎవరికీ పెద్దగా చదువు లేకపోవటంతో శ్రీనును పెద్ద చదువులు చదివించాలని ఆయన ఆశపడ్డాడు.

ఆయన మనసెరిగినట్టే శ్రీను శ్రద్ధగా చదివేవాడు. ఊళ్లో పాఠశాలలో ఉన్న తరగతులన్నిటిలో ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు.

'నువ్వు పట్నం వెళ్లి పై చదువులు చదవాలని నా కోరిక' ఓ రోజు శ్రీనును దగ్గరకు తీసుకుని చెప్పారు వాళ్ల నాన్న.

శ్రీను తలాడించాడు.

'నాకు కూడా పట్టణం వెళ్లి చదువుకోవాలని ఉంది నాన్నా' అన్నాడు శ్రీను ఉత్సాహంగా.

'ఎందుకండీ పట్టణం చదువులు. అక్కడ పిల్లలు చదువు తక్కువ, చెడిపోవటం ఎక్కువ అని విన్నాను. మన కామేశం కొడుకు పట్టణం చదువు కోసం వెళ్లి ఎవరో అమ్మాయిని ప్రేమించి నానాగోల చేసుకుని జీవితం పాడు చేసుకోలేదూ...'' ఇలా ఇంకా పట్నం వెళ్లి పాడయి పోయిన వాళ్ల పురాణాలు విప్పబోయింది శ్రీను వాళ్ళమ్మ.

కానీ ఆమె మాటలకు మధ్యలోనే అడ్డు వచ్చాడు శ్రీను వాళ్ల నాన్న. ఒకడు చెడిపోయాడని అందరూ చెడిపోతారా? అందరి లాంటివాడు కాదు శ్రీను. వీడు అరుదైన అబ్బాయి. అయినా అన్ని ఆకర్షణలకూ దూరంగా ఉండి మంచిగా ఉండటంలో గొప్పలేదు. అన్ని ఆకర్షణల నడుమ ఉంటూ కూడా దేనికీ లొంగకుండా తన బాధ్యత విజయవంతంగా నిర్వహించేవాడే నిజమైన మనిషి. నా శ్రీను నిజమైన మనిషో కాదో, తెలిసిపోతుంది. పట్నం వెళ్లనీ' అన్నారు.

అవి ఎదురులేని మాటలు.

తండ్రి అన్న మాటల గురించి చాలా ఆలోచించాడు శ్రీను. ఆలోచిస్తున్న కొద్దీ తండ్రి మాటల లోతు అతనికి అర్థమవసాగింది.

'నేను నిజమైన మనిషినని నిరూపించుకుంటాను. నేను అరుదైన అబ్బాయినని అందరితో అనిపించుకుంటాను' అని గట్టిగా అనుకున్నాడు శ్రీను.

శ్రీను పట్నం ప్రయాణం అవుతుంటే వాళ్ల నాన్నగారు మహాత్మా గాంధీ స్వీయ జీవితచరిత్ర 'మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' తెచ్చి

అతని చేతిలో ఉంచారు.

పట్నం చేరేలోగా ఆ పుస్తకం చదివేశాడు శ్రీను. లండన్ వెళ్లి కూడా మాంసం ముట్టనని తల్లికి చేసిన ప్రతిజ్ఞను గాంధీజీ ఎలా నిలబెట్టుకున్నాడో, అలాగే తన దృష్టిని చదువుపై తప్ప మరో విషయంపై మళ్లనివ్వకూడదని నిశ్చయించుకున్నాడు శ్రీను.

అయితే ప్రవాహంలో కొట్టుకుపోకూడదనుకోవటం వేరు. నిజంగా ప్రవాహ వేగాన్ని తట్టుకుని స్థిరంగా నిలబడగలగటం వేరు.

పట్నంలో ప్రతీదీ వింతగా అద్భుతంగా కనబడేది శ్రీనుకు. పట్నం విద్యార్థులను చూస్తూంటే, వారి ప్రవర్తన, వాగ్ధోరణలు గమనిస్తూంటే శ్రీను అతడికి తెలియకుండానే న్యూనతాభావం ప్రవేశించింది. తనూ వారిలో ఒకడిగా ఆమోదింపబడాలన్న భావన కలిగింది.

కానీ వారిలో ఒక్కడిగా చేరటం అంత సులువు కాదని శ్రీనుకు అర్థమయింది.

తన సమవయస్కులే అయినా వాళ్లు శ్రీనుని తక్కువ వాడిగా చూసేవారు. ఏమీ తెలియని అమాయకుడిని ఏడ్పించినట్టు ఏడ్పించేవారు. ఏమీ అర్థంకాని పల్లెటూరి మొద్దు అని వెక్కిరించేవారు. అది భరించటం దుర్భరంగా ఉండేది శ్రీనుకు. ఎలాగయినా వారిలో ఒకడిగా మెలగాలన్న పట్టుదల అతడిని నిలవనిచ్చేది కాదు.

అనుక్షణం అతడి ఆలోచనలు వారిలో ఒకడిగా గుర్తింపు పొందాలన్న తపన చుట్టే తిరిగేవి.

ఏంచేస్తే వారి ఆమోదం పొందుతానా అని ఆలోచించగా అతడికి ఓ విషయం తట్టింది.

వాళ్లంతా స్టయిలిష్‌గా బట్టలు వేసుకుంటారు. హిందీ, ఇంగ్లీషులు అధికంగా కలిసిన తెలుగు మాట్లాడతారు. సిగరెట్లు తాగుతారు. టీలు తాగుతారు. బళ్లు నడిపిస్తారు.

అయితే వీటన్నిటినీ మించింది డబ్బు. వాళ్ళల్లో డబ్బు ఎక్కువగా ఖర్చుపెట్టే వాడిచుట్టూ అందరూ తిరుగుతారు.

పట్నంలో ప్రతీదీ వింతగా అద్భుతంగా కనబడేది శ్రీనుకు. పట్నం విద్యార్థులను చూస్తూంటే, వారి ప్రవర్తన, వాగ్ధోరణలు గమనిస్తూంటే శ్రీను అతడికి తెలియకుండానే న్యూనతాభావం ప్రవేశించింది. తనూ వారిలో ఒకడిగా ఆమోదింపబడాలన్న భావన కలిగింది.



ఇది అర్థం చేసుకున్న శ్రీను అంతవరకూ తన తండ్రి ఎంత డబ్బు పంపుతానన్నా వద్దనేవాడు. వద్దనటం మానేశాడు.

పంపిన డబ్బును ఖర్చుపెట్టి ఇంకాస్త డబ్బు పంపమని రాసేవాడు.

'ఎందుకని' అడగకుండా తండ్రి డబ్బు పంపిస్తూండేవాడు.

శ్రీను వేషధారణ మారిపోయింది.

పూర్తిగా పట్టణవాసి అయిపోయాడు.జీన్సు, నల్ల కళ్లద్దాల నుండి ద్విచక్ర వాహనం వరకూ ఆధునికం అయిపోయాడు.

కానీ సిగరెట్ల జోలికి వెళ్లలేదు.

'ఇవివేరు. అవివేరు' అనేవాడు ఎవరయినా బలవంత పెడితే.

అయితే శ్రీను ఇంతగా మారినా అతడిని ఇంకా పల్లెటూరి వాడిని, అమాయకుడిని చూసినట్టే చూసి చులకన చేయటం మానలేదు.

ఏంచేస్తే తాను వారిలో ఒకడవుతాడో అర్థం కాలేదు శ్రీనుకు. చివరికి ఓ ఫ్రెండును పక్కకు పిలిచి అడిగాడు.

వాడు నవ్వి చెప్పాడు. 'అందరికీ ఓ పార్టీ ఇవ్వవోయ్' అని.

అర్థంకాని శ్రీనుకు 'పార్టీ' అర్థం విడమరచి చెప్పాడు. 'అందుకే నిన్ను ఊరోడంటాం. ఇంత చిన్న విషయం కూడా ఇంత చెప్తేకానీ నీకు అర్థంకాదు' అన్నాడు చివరికి.

ఉక్రోషం పట్టలేకపోయాడు శ్రీను. వెంటనే ఇంటి నుంచి డబ్బు తెప్పించాడు. పట్నం గ్యాంగ్‌ను పార్టీకి పిలిచాడు.

వాళ్లు ముందు నవ్వారు. తర్వాత పార్టీలో ఏమేమి ఉండాలో షరతులు విధించారు.

శ్రీను అన్నిటికీ ఒప్పుకున్నాడు.

పార్టీ ఆరంభమయింది. వాళ్లు తాగటం ఆరంభించారు.

'మరి నువ్వో?' అడిగారు.

'నేను తాగను' తల అడ్డంగా తిప్పాడు శ్రీను.

అందరూ గొల్లుమన్నారు. 'మరదే. అందుకే నిన్ను మాలో ఒకడు అని అనం' అన్నారు.

కోపం పట్టలేకపోయాడు శ్రీను. తాగటం ఆరంభించాడు.

ఆరంభంలో అయిష్టంగానే అయినా అది అతి ఇష్టంగా మారేందుకు ఎక్కువ కాలం పట్టలేదు. ఇంటినుంచి డబ్బు తెప్పించుకుని మరీ తాగేవాడు. తాగించేవాడు. దాంతో మిత్రబృందం అంతా అతని చుట్టే చేరేవారు.

నెమ్మదిగా ఒకో మెట్టు తనకు తెలియకుండానే దిగజారటం ఆరంభించాడు శ్రీను.

మిత్రులు తనని పొగుడుతూంటే ఏదో గొప్ప పని సాధించినట్టు ఫీలయిపోయేవాడు. వాళ్ల పొగడ్తల కోసం మరింత ఖర్చు పెట్టేవాడు. వాళ్లు కోరినవి అందించేవాడు.

ఈ రకంగా తానేమిటో, తాను పట్నం ఎందుకు వచ్చాడో పూర్తిగా మరచిపోయాడు.చదువును నిర్లక్ష్యం చేశాడు. రాత్రింబవళ్లు మిత్రులు, మద్యం తప్ప మరో ధ్యాసలేని స్థితికి చేరుకున్నాడు.

ఈ దశలో ఒకరోజు తెలుగు లెక్చరర్ నుంచి పిలుపు వచ్చింది శ్రీనుకి.

తెలుగు లెక్చరర్ పేరు విశ్వం. ఆయన పాఠాలు చాలా బాగా చెప్తారు. ఎవరైనా ఏదైనా అర్థం కాలేదని ఆయన దగ్గరకు వెళ్తే ఓపికగా అర్థమయ్యే వరకూ వివరిస్తారు.

'చదువంటే పాఠాలు బట్టీపట్టి ప్రశ్నలకు సమాధానాలు కక్కేయటం కాదు. చదువంటే విజ్ఞానార్జన. చదువంటే ప్రపంచాన్ని ఎదుర్కొని, ప్రపంచంపై తన వ్యక్తిత్వ ముద్రను వేసేందుకు వ్యక్తి తనని తాను సిద్ధం చేసుకోవటంలో వేసే మొదటి అడుగు. ఏదో మొక్కుబడిగా చదవకండి. ధ్యానంతో దీక్షగా చదవండి' అని సలహా ఇచ్చాడాయన మొదటిరోజే.

శ్రీనుకు ఆయన బాగా నచ్చాడు. పట్నం మిత్రులతో స్నేహం పెరగకముందు ఆయన క్లాసుకు తప్పకుండా అటెండయ్యేవాడు. ఆయనంటే మంచి గౌరవం ఏర్పడింది శ్రీనుకు. విశ్వంగారు పాఠం చెప్పేవిధానంలో ఆకర్షణ ఉంది. ఆయన వ్యక్తిత్వం మరింతగా శ్రీనును ఆకర్షించింది. అందుకే ఆయన పిలిచాడని తెలిసి ముందు కంగారుపడ్డాడు.

వెళ్లవద్దని అనుకున్నాడు.

'ఆయన ఎవరు నిన్ను పిలవటానికి? ఫీజు కట్టావు. సరిపోయింది. క్లాసుకు వెళ్లటం వెళ్లకపోవటం నీ ఇష్టం' అన్నారు శ్రీను మిత్రులు.

వాళ్ల మాటల వల్ల మొండిధైర్యం వచ్చింది శ్రీనుకు. 'అవును వాడెవడు నన్ను పిలవటానికి?' అన్నాడు పైకి బింకంగా.

కానీ ఎందుకో పైకి అన్నంత తేలికగా విశ్వంగారిని కొట్టేయలేకపోయాడు. ఏమూలో అతనికి తాను తప్పుదారిలో ప్రయాణిస్తున్నానన్న భావన ఉంది. అందుకే ధైర్యం చిక్కబట్టుకుని విశ్వంగారిని కలిశాడు.

ఆయన శ్రీనును చూసి వాత్సల్య పూర్వకంగా నవ్వారు. చనువుగా భుజం మీద



# హోమ్‌వర్క్

**తండ్రి:** ఈ హోమ్‌వర్క్ నోట్స్ చూసి మీ టీచర్ ఏమంది.

**కొడుకు:** రేపటి నుంచి ఆవిడే మన ఇంటికి వచ్చి ట్యూషన్ చెబుతానంది.

**తండ్రి:** ఇంకేం. రేపటి నుంచి స్కూలు అయిపోయిన వెంటనే తిన్నగా ఇంటికి రా.

**కొడుకు:** నేను కాదు. నువ్వే ఆఫీసునుంచి త్వరగా ఇంటికి రా!

**తండ్రి:** నేనెందుకు?

**కొడుకు:** నీకే మా టీచర్ ట్యూషన్ చెబుతానంది. నువ్వు చేసిన హోమ్‌వర్క్‌లో అన్నీ తప్పులేట.

చేయివేసి దగ్గరకు తీసుకున్నారు.

శ్రీనుకు ఒక్కసారిగా నాన్నగారు గుర్తుకు వచ్చారు. అతడి కళ్లల్లో నీళ్లు కదిలాయి.

'ఏమోయ్, ఈమధ్య క్లాసులో కనిపించటం లేదు?' ఆప్యాయంగా అడిగారు.


శ్రీను మాట్లాడలేదు. తల వంచుకున్నాడు.

'చూడు శ్రీనూ... నువ్వు పట్నం వచ్చింది చదువుకోవటానికి. అది మరచిపోకు. నీ సంగతి నాకు తెలుసు. నువ్వు మంచి పిల్లవాడివి. చూడూ, ప్రపంచంలో వ్యక్తి తన న్యూనతాభావాన్ని అధిగమించి వ్యక్తిలా నిలబడి తనదంటూ సమాజంలో ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకోవటం కోసం చేసే ప్రయత్నమే అతని జీవిత కథ. నువ్వు పట్నంలో ఒక పార్శ్వమే చూశావు. డబ్బు అధికంగా ఉండి జులాయిల్లా తిరిగే వారిని మాత్రమే చూశావు. మరోవైపు చూడు, ఎంతోమంది బుద్ధిగా వచ్చి చదువుకుంటున్నారు. ఇంకెంతోమంది ట్యూషన్లు చెప్పుకుంటూ, రకరకాల పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ చదువుకుంటున్నారు. ఒక్కసారి బయటకు వెళ్లి చూడు. ఎంతోమంది నీ వయసు వారు, నీకన్నా చిన్న వయసువారు చదివేందుకు డబ్బులు లేక రకరకాల పనులు చేస్తూ జీవితం గడుపుతున్నారు. వాళ్లని చూసి నువ్వెంత అదృష్టవంతుడివో తెలుసుకో' మృదువుగా అనునయంగా చెప్తున్నారు విశ్వం.

అతని ఒక్కో మాట అక్షరాలా సత్యం అని శ్రీనుకు తెలుసు. ఆ మాటలలోని సత్యం బరువు క్రింద శ్రీనులోని దుష్టపుటాలోచనలు నలిగిపోసాగాయి. తన దృష్టి ఎంతసేపూ అల్లరివాళ్లు, జులాయిల ఆమోదం పొందాలని ప్రయత్నించటం వైపే ఉంది తప్ప నిజంగా నిజాయితీగా చదవటం కోసం కాలేజీకి వచ్చిన వాళ్ల వైపు లేదు.

తల వంచుకున్నాడు శ్రీను.

'శ్రీనూ... నీరు ఎలాగయితే పల్లంవైపే ప్రయాణిస్తుందో, మనిషి మనసు అలాగే దిగజారుడువైపు త్వరగా పరుగిడుతుంది. మనసుకు కళ్లెం వేసి విచక్షణతో అది ఉన్నత శిఖరాలు అధిరోహించేట్టు చేయటంలోనే మనిషి వ్యక్తిత్వం వ్యక్తమయ్యేది. నువ్వు వేరే వాళ్ల ఆమోదం కోసం నిన్ను నువ్వు భ్రష్టు పట్టించుకున్నావు. కానీ నీ మనస్సాక్షి ఆమోదం గురించి ఆలోచించలేదు. నీ నాన్నగారి మనస్సు ఆమోదం గురించి పట్టించుకోలేదు. నువ్వు అడిగినపుడల్లా లేదనకుండా, ఎందుకని అడగకుండా డబ్బు అందజేస్తున్నారంటే ఆయనకు నీమీద ఎంత నమ్మకమో అర్థంచేసుకో. ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తున్నావన్న కనీసపుటాలోచనను ప్రదర్శించు. చివరగా, నీకో విషయం చెప్తాను. ఈ ప్రపంచంలో మనం ఒంటరిగా వస్తాం. ఒంటరిగా బతుకుతాం. మనం మనతోటి మనుషుల పొగడ్తలు, ఆమోదాలు, ప్రశంసల కోసం పాకులాడి లాభం లేదు. నీ మనస్సాక్షి దారి దివ్వెగా సాగిపో. నువ్వు ఆలోచించాల్సింది ఒక్క విధాత పొగడ్త ఆమోదం, ప్రశంసలకోసమే. దానిముందు మిగతావన్నీ దిగదుడుపే. ఆలోచించుకో. మనుషుల పొగడ్తలు కోరి మనస్సాక్షిని చంపుకుంటావో, విశ్వసృష్టి కారుడు నీ కిచ్చిన సృజనాత్మకశక్తిని సద్వినియోగం చేసుకుని మనిషిగా ఎదుగుతావో... నీ ఇష్టం' అన్నారు.



ఆయన వెళ్లిన చాలాసేపటి వరకూ శ్రీను ఆలోచిస్తూ ఉండిపోయాడు.

అతడికి ఎవరితో మాట్లాడాలనిపించటంలేదు. మనుషులందరికీ దూరంగా పారిపోయి ఒంటరిగా కూర్చుని దిగంతాలవైపు చూస్తూండిపోవాలని ఉంది. భోరున ఏడుస్తూ చేజార్చుకున్న కాలాన్ని తిరిగి వెనక్కి తిప్పాలని ఉంది. వ్యర్థంగా గడిపిన కాలాన్ని సద్వినియోగం చేసుకుని తన జీవితానికి ఒక సార్థకత కల్పించుకోవాలని ఉంది.

ఇలా ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్న శ్రీను కళ్లముందు అంత వరకూ తాను చూసి కూడా పట్టించుకోని అనేక చిన్నచిన్న దృశ్యాలు కదలసాగాయి.

తాము తాగుతూంటే చిప్స్ తెచ్చిచ్చే పసిపిల్లలు, సిగరెట్లు అమ్మే పిల్లలు, ట్యాంక్‌బండ్‌లో కూర్చుంటే రకరకాల చిరుతిళ్లు పట్టుకొచ్చి కొనుక్కోమని అభ్యర్థించే పిల్లలు, రోడ్ల పక్కన మురికి కాలువల పక్కన పడి పొర్లే పసిపిల్లలు తమను చూపించి అడుక్కునే తల్లుల చంకల్లోంచి ప్రపంచం వైపు వింతగా వ్యంగ్యంగా చూస్తున్న పసిపిల్లలు, ...రెండు చేతుల్లో ముఖం దాచుకుని గుండెలు పగిలేలా ఏడవటం ఆరంభించాడు శ్రీను.

** ** **

ఆ తరువాత శ్రీను ప్రవర్తన పూర్తిగా మారిపోయింది.

ఇంటి నుంచి తండ్రి పంపే డబ్బు వద్దని తిరస్కరించాడు. పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయటం ఆరంభించాడు. తను సంపాదిస్తున్న డబ్బుతోటే బతకటం ఆరంభించాడు.

'అదేమిట'ని అడిగిన తండ్రికి సమాధానం ఇచ్చాడు.

'మనిషికి సులభంగా లభించేవాటి విలువ తెలియదు. కష్టపడి సాధిస్తేనే విలువ తెలుస్తుంది. ఆ సాధించిన దానికి సార్థకత లభిస్తుంది.'

శ్రీను కాలేజీలో ఫస్టు రావటమే కాదు. సివిల్ సర్వీసులోనూ సెలక్టయ్యాడు.

అతను ఐఎఎస్‌గా ఉద్యోగం ఆరంభించిన కొన్నాళ్లకే అతడి తండ్రి మరణించాడు. తండ్రి ఆస్తిలో చిల్లిగవ్వ కూడా తాకలేదు శ్రీను.

'నా కాళ్ల మీద నేను నిలబడ్డాను. నాకు సరిపడ సంపాదిస్తున్నాను. నాకు ఇంతకన్నా ఎక్కువ అవసరంలేదు' అన్నాడు.

ఓ ట్రస్టు ఏర్పాటుచేసి తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని తమ ఊళ్లోని పేదపిల్లల ఉచిత విద్య కోసం వినియోగించటం ఆరంభించాడు.

అందుకే ఊళ్లోని వాళ్లంతా శ్రీనును 'అరుదైన అబ్బాయి' అనటం ఆరంభించారు. ఎంత ఆస్తి ఉన్నా ఇంకా సంపాదించాలని ఆత్రపడే వాళ్ల నడుమ, స్వచ్ఛందంగా, ఆస్తిని త్యజించిన వ్యక్తి అరుదైన వాడే మరి!

'అథోపాతాళానికి వెళ్లి, నిలదొక్కుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తి నిజమైన మనిషి. నిప్పులో కాలినా మెరిసేదే బంగారం. బంగారంలాంటి అరుదైన అబ్బాయి శ్రీను' అంటారు విశ్వంగారు.

కానీ ఎవరెంతగా పొగిడినా శ్రీను మాత్రం పొంగిపోవటం లేదు. అతనికిప్పుడు సాటి మానవుల పొగడ్తలపై ఆశ లేదు. మనస్సాక్షి ఆమోదం, విశ్వవిధాత అందించే బహుమతులపైనే అతని దృష్టి.

అందుకే అరుదైన అబ్బాయిలలో అరుదైన అబ్బాయి శ్రీను.

**అతడికి ఎవరితో మాట్లాడాలనిపించటంలేదు. మనుషులందరికీ దూరంగా పారిపోయి ఒంటరిగా కూర్చుని దిగంతాలవైపు చూస్తూండిపోవాలని ఉంది. భోరున ఏడుస్తూ చేజార్చుకున్న కాలాన్ని తిరిగి వెనక్కి తిప్పాలని ఉంది. వ్యర్థంగా గడిపిన కాలాన్ని సద్వినియోగం చేసుకుని తన జీవితానికి ఒక సార్థకత కల్పించుకోవాలని ఉంది.**